www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 16 అక్టోబర్ 2024

5

చిత్తూరు

విశ్రాంత పోలీసుల సాయం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వరద బాధితులకు తమవంతు సాయంగా రూ.35 వేల చెక్కును జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుకు విశ్రాంత పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు మంగళవారం అందజేశారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన భారీ వర్షాలు, వరదలు ప్రజలకు తీవ్రనష్టం కలిగించాయని, ఈ విపత్తు వల్ల అనేక మంది నిరాశ్రయులై, జీవితాలు దెబ్బతిన్నాయని ఈ క్రమంలో చిత్తూరు జిల్లాలో విశ్రాంత పోలీస్ అసోసియేషన్ వారు తమ వంతు సాయంగా రూ.35 వేల చెక్కును జిల్లా ఎస్పీకి అందజేశారు.

ఎస్పీకి చెక్కును అందజేస్తున్న విశ్రాంతి పోలీసులు

ఎడతెరిపి లేని వాన

జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం : కలెక్టర్ సుమిత్ కుమార్

- చెరువులు, కాలువల పరిశీలన
- నేడు స్కూల్స్, కాలేజీలకు సెలవు
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- పంటలు, పశువుల రక్షణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తుపాను నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులైనా ఎదుర్కొనేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు జిల్లా కలెక్టర్ సమిత్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసామని, అందరూ వారివారి ప్రధాన కార్యస్థానంలో ఉన్నట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు మండల స్థాయిలోని అన్ని లైన్ డిపార్ట్మెంట్స్ సమన్వయంతో పనిచేసేందుకు తగు ఆదేశాలు జారీ చేశామని, జాతీయ రహదారుల్లో వర్షాల వల్ల ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ప్రతి మూడు గంటలకు ఒకసారి నివేదికను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పంట ఉత్పత్తులకు నష్టం కలవకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రైతులను అప్రమత్తం చేయడంతో పాటు బుధవారం, గురువారం రోజుల్లో భారీస్థాయిలో వర్షాలు చూసే అవకాశం ఉన్నందున విపత్తు పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు. కంట్రోల్ రూమ్ నెంబర్ 94910 77356, ల్యాండ్ ఫోన్ నెంబర్ 08572-242777 ఏర్పాటు చేయడంతో పాటు ఈ నెల 16వ తేదీలలో పాఠశాలలకు సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితులపై రెవెన్యూ, పోలీసు, అన్ని శాఖల అధికారులు అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.

గుడిపల్లిలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

వరి పంటను కాపాడుకోవాలి..

గుడిపల్లి: వాతావరణ శాఖ వారి తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండల రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. వరి పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్నందున వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతలో తడవకుండా ఆరబెట్టుకోవాలని, తుపాను వెలిసిన తరువాత ఆ ధాన్యమును ఆరబెట్టుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే తడిసిన ధాన్యం మొలకలు రాకుండా 5శాతతం ఉప్పు దావణం పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే రాగి, కూరగాయలు, ఆకుకూరలు, మిరప, మల్బరీ పంట చేనుల్లో వర్షపు నీరు నిల్వ చేరకుండా చిన్న కాలువలు చేసుకోవాలన్నారు.

ముసురు వానలు- ప్రజల అవస్థలు

ఎస్ఆర్ పురం: ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వానలకు మండలంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వ్యవసాయ పనులు, కూలి పనులు చేసుకుని జీవించే వారికి వాన వలన పనులు లేక ఇళ్లకే పరిమితం అవ్వాల్సి వస్తోంది. ఇక పశువులు, గొర్రెలు, మేకలు సైతం మేత లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మేపుకు వదలాన్నా ముసురు వానలతో బయటికి రాలేని పరిస్థితి. దీంతో పాడిరైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

విజయపురం ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం తహశీల్దార్ కిరణ్ తెలిపారు. తుపాన్ ప్రభావంతో వాగు, వంకలు పొంగి ప్రవహించే అవకాశం ఉందని ప్రజలు బయట రాకుండా ఇంటికే పరిమితం కావాలని సూచించారు. ప్రజలకు ఎదైన సమస్యలుంటే 94910 77037కు కాల్ చేయాలని తెలిపారు.

సురక్షిత ప్రాంతాల్లో ఉండండి: సిఐ

కార్వేటినగరం: తుపాను నేపథ్యంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రభుత్వం చిత్తూరు జిల్లాను రెడ్ అలెర్టుగా ప్రకటించిందని సిఐ హనుమంతప్ప తెలిపారు. మంగళవారం స్థానిక కోటచెరువును సందర్శించారు. సిఐ మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో నివాసాలు ఉన్నవారు సురక్షత ప్రాంతాలకు, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తలదాచుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్పా బయటకు రాకూడదని, అవసరమైతే 9440900689, 9440900690 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

పుంగనూరు: వర్షాభావ పరిస్థితులకు దృష్ట్యా పట్టణంలో మున్సిపల్ ఉద్యోగులు వారు నిర్వర్తించే విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. భారీ వర్షభావ పరిస్థితులకు సిబ్బంది అందరు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా మురుగునీటి కాలువలకు సంబంధించి ఎప్పటికప్పుడు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పశువుల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

సోమల: తుపాను కారణంగా భారీ వర్షాలు, ఈదురు గాలులు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు మండలంలోని పాడి రైతులు తమ పశువులను సంరక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సోమల ప్రాంతీయ పశు వైద్య సంచాలకులు శ్రీనివాసులు నాయుడు కోరారు. పశువులను బలహీనమైన పాకల కింద, చెట్ల కింద, రేకుల షెడ్లు కింద, విద్యుత్ స్తంభాలకు వేలాడే తీగలు ట్రాన్స్ఫార్మర్లకు సమీపంలో కట్టి ఉంచకూడదని తెలిపారు. పశువులకు రెండు, మూడు రోజులకు అవసరమైన మేతను సిద్ధంగా ఉంచుకొని ఇంటి వద్దనే ఉండి మేపుకోవాలని కోరారు. గొర్రెలు, మేకలను నదీ పరివాహక ప్రాంతాలు వంకలు, వాగులకు సమీపంలో కాకుండా విశాలమైన పచ్చికబయలు కలిగిన ప్రాంతాలలో మేపుకోవాలని సూచించారు. వైద్యాధికారిని చందన ప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండండి: కమిషనర్

చిత్తూరుఅర్బన్ : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ పి.నరసింహప్రసాద్ చెప్పారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మంగళవారం ఉదయం కమిషనర్ నగరంలో పలు ప్రాంతాల్లో పర్యటించి తనిఖీలు చేపట్టారు. నగర శివారులోని బుడమాల చెరువును కమిషనర్ తనిఖీ చేశారు. చెరువులో ప్రస్తుతం నీటిమట్టం ఎంత ఉంది..? నీటిమట్టం పెరిగితే నీరు నివాసప్రాంతాలకు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రధానంగా గతంలో భారీ వర్షాలు వచ్చినప్పుడు నీరు నిల్వ చేరిన లోతట్టు ప్రాంతాల్లో అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. చిన్న, పెద్ద కాలువల్లో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమాచారం అందివ్వాలన్నారు. నీవానది పరివాహకప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో అత్యవసర సమయాల్లో నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 9849907885 సమాచారం ఇవ్వాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

తిమ్మసముద్రం చెరువును పరిశీలిస్తున్న నగర కమిషనర్

వాగును పరిశీలించిన ఆర్డీవో

ఎస్ఆర్ పురం : చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు మంగళవారం మండలంలోని గిడ్డమాకురాజపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వాగును పరిశీలించారు. ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాన్ పట్ల అధికారులు తీసుకుంటున్న చర్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొత్తపల్లిమిట్ట నుంచి కలెక్టర్‌కు గ్రీవెన్స్ వచ్చిన అర్జీలు హేమాద్రి దారి విషయం, వేదవతి భూ సమస్య అడిగి తెలుసుకున్నారు. అలాగే చిత్తూరు-పుత్తూరు రోడ్డు పాత రోడ్డు ఆక్రమణలపై అక్రమ నిర్మాణాల గురించి విచారించి రెండు రోజుల్లో నివేదికలు పంపాలని తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే గురజాల

మరో రెండు రోజులపాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లతో అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. వర్షాలను ముందుగానే అంచనా వేస్తూ నగరపాలక సంస్థ అధికారులు నగరంలోని కాలువల్లో పూడికలు చాలావరకు తీయించడం జరిగిందన్నారు. గడిచిన రెండు రోజులుగా నగరపాలక అధికార యంత్రం ఎక్కడికక్కడ చిన్న, పెద్ద కాలువల్లో అడ్డంకులు లేకుండా జేసీబీలతో పనులు చేయిస్తుందన్నారు. గుడిపాల, రూరల్ మండలాల్లో ఇప్పటికే అధికారులు తగు చర్యలు తీసుకున్నట్లుగా తెలిపారు. చిత్తూరు నగరంలోని నీవా నది పరివాహక ప్రాంతాల ప్రజలు, గంగినేని చెరువు మొరవ కాలువ వెంబడి ఉన్న ప్రజలు, లోతట్టు, ఇతర శివారు ప్రాంతాల్లో చెరువుల వద్ద నివాసాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలన్నారు.

చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్మోహన్

'గిరిజనులకు ఆధార్ కార్డులివ్వండి'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తహశీల్దార్లు, ఎంపిడిఓలు సమన్వయం చేసుకొని ఆధార్‌కార్డులు లేని గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆర్‌డిఓలు అన్ని మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా ఆధార్ కార్డులు లేని గిరిజనులకు ఆధార్ కార్డులు మంజూరు చేయడానికి మండల తహశీల్దార్లు, ఎంపీడీఓలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు అవసరమన్నారు. ఆధార్ కార్డు మంజూరుకు మొదటిగా జనన ధ్రువీకరణ పత్రం అవసరమని, జనన, ధ్రువీకరణ పత్రం లేనివారికి ఎంపీడీఓలు నిర్ధారించి వారికి ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలన్నారు. విఆర్ఓలు, పంచాయతీ సెక్రటరీలు సచివాలయ పరిధిలో ఆధార్ కార్డులు లేని గిరిజనుల జాబితా తయారు చేయాలని, మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి వందశాతం గిరిజనులకు ఆధార్ కార్డులు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి, జడ్పీ సీఈవో రవి కుమార్, డిఎల్‌డిఓ రవి కుమార్, అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం చేయకండి: ఎస్పీ

ప్రజాఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కారం వేదిక కార్యక్రమం స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 16 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు స్వీకరించారు. ఈకార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని దేవరగుడి పల్లి గ్రామంలో రెండు రోజులుగా తాగునీటికి తంటాలు పడుతున్నారు. మంగళవారం ఆ గ్రామస్తులు విషయాన్ని విలేకరుల దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ కోతలు, సరఫరాలో ఇబ్బంది తలెత్తడంతోనే నీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ రంగనాథంను వివరణ కోరగా సోమవారం తాగునీటి బోరుకు సప్లై ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనిందని, దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. తమ సిబ్బంది పునరుద్ధరణ పనిలో ఉన్నట్లు చెప్పారు. సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఆటోలో తాగునీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

సమస్యలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించే సమస్యల అర్జీలపై వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షి నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసే ప్రతిఅర్జీని క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసుశాఖలకు సంబంధించి ఎక్కువుగా అర్జీలు రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కారం కాలేని సమస్యకు సంబంధించి ఎందుకు పరిష్కారం కాలేదున్న పూర్తి సమాచారాన్ని అర్జీదారానికి ఎండార్స్మెంట్ ద్వారా తెలియజేయాలన్నారు. అర్జీలు రీఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను అర్జీదారులతో ఫోన్‌ద్వారా మాట్లాడి ఆ అర్జీని పరిశీలించాలన్నారు. 48 గంటల లోపల పరిష్కరించాల్సిన అర్జీలను గుర్తించి సంబంధించిన శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. జెడ్పి సీఈవో రవి కుమార్, గృహనిర్మాణ సంస్థ పిడి పద్మనాభం, డ్వామా పిడి రవికుమార్, పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ ప్రభాకర్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.మూర్తి, డిఎల్‌డిఓ రవికుమార్ పాల్గొన్నారు.

జిల్లా ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈగా ఇస్మాయిల్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా ఏపీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా ఇస్మాయిల్ అహ్మద్ నియమితులయ్యారు. మంగళవారం స్థానిక గిరింపేటలోని ఏపీఎస్పీడీసీఎల్ చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ చిత్తూరు అర్బన్, రూరల్ విభాగాల ఈఈలు మునిచంద్ర, సురేష్ కుమార్, స్టోర్స్ ఏడీఈ బాలాజీ నూతన ఎస్ఈకి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎస్ఈ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, విద్యుత్ బకాయిల వసూళ్లపై తలెత్తుతున్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడం, అన్ని రంగాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేలా ఆపరేషన్ విభాగాన్ని పటిష్టం చేస్తామని ఎస్ఈ స్పష్టం చేశారు. ఏఈలు వివేకానందరెడ్డి, మోహన్ రావు, బాలగున్నయ్య, చిత్తూరు రూరల్ ఈఈ కార్యాలయ జేఏఓ రవిచంద్ర, ఏపీఎస్పీడీసీఎల్, ట్రాన్స్కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇస్మాయిల్ అహ్మద్‌ను అభినందిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు మహర్దశ

గ్రామాల్లో 'పల్లె పండుగ' ప్రారంభం

ప్రజాశక్తి- ఐరాల

పల్లె పండుగ వారోత్సవాలు మంగళవారం పూతలపట్టు నియోజకవర్గ ఐరాల మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జోరువానలో కూడా పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ గ్రామాల్లో ప్రతి ఒక్కరిని పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పొలకల పంచాయతీ ఉల్లారవాండ్లపల్లెలో మంగళవారం రూ.4.40లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లకు, డ్రైనేజీలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మొరంపల్లె గ్రామంలో రూ.3.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, 35.ఎర్లపల్లె గ్రామంలో రూ.3లక్షలతో వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును, పుత్తరమద్ది గ్రామంలో రూ.2లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, బొమ్మసముద్రం గ్రామంలో రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్.రాజన్, మండలాధ్యక్షులు గిరిధర్ బాబు, సీఈవో రవికుమార్ నాయుడు, ఉపాధి హామీ పీడీ రవి, ఏపిడి సుబ్రహ్మణ్యం, డిఎల్‌డిఓ రవికుమార్, ఎంపీడీవో ధనలక్ష్మి, ఎమ్మార్వో మహేష్ కుమార్, జడ్పిటిసి సుచిత్ర కన్నా నాయుడు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి పంచాయతీ కొండకిందపల్లి గ్రామంలో మంగళవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ భారతీ సీసీ రోడ్డు పనులకు భూమిపూజ ప్రారంభించారు. టిడిపి నాయకులు బిఎం.రవి, బూత్ కమిటీ కన్వీనర్ శంకరయ్య, చిన్నస్వామి, మొగిలయ్య, సి.రాజగోపాల్, చిరంజీవి నాయుడు పాల్గొన్నారు.

సోమల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా నూతన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మూడు పంచాయతీల పరిధిలోని నాలుగు గ్రామాలలో సిమెంటు రోడ్ల పనుల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. వల్లిగట్ల పంచాయతీ అగ్రహారం వడ్డిపల్లి వెంగంవారిపల్లి, కామిరెడ్డి వారి పల్లి పంచాయతీ ఎర్రంవారిపల్లి, నెల్లిమంద పంచాయతీ బురుజు పల్లి కమ్మపల్లి గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉపాధి హామీ ఏపీవో దినకర్ బాబు, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: మండలంలోని డీకే మర్రిపల్లిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నూతనంగా రూ.5లక్షల వ్యయంతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణంనకు ఎంపీడీవో మోహన మురళి పంచాయతీ కార్యదర్శి జ్యోతినాథ్ ప్రజ ప్రతినిధులు భూమిపూజ చేశారు. ఇంజనీర్ అసిస్టెంట్ భరత్, ఏపీవో చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రామ్మూర్తి పాల్గొన్నారు.

గుడిపల్లి: మండలంలోని పిబి.వాడ గ్రామపంచాయతీలో మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పల్లె పండుగ వారోత్సవాలలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అలాగే గ్రామపంచాయతీలోని మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బాబు నాయుడు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుబ్రమణి, ప్రధాన కార్యదర్శి భాను పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ రాజేంద్ర బాలాజీ, ఏపి హరినాథ్ మండలంలోని తీర్థం గ్రామంలో రూ.9,70,000ల వ్యయంతో సిసి రోడ్డు, డ్రైనేజీ కాలువలు నిర్మాణానికి భూమి పూజ, అలాగే దేవదొడ్డి గ్రామంలో రూ.5,60,000ల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల నుంచి సిసి రోడ్డు, కుటవుల వంక, మొగలి పొదరేవుల్లో రూ.3,50,000లతో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

బంగారుపాళ్యం: మండల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలపై మండల ఇన్చార్జి ఎంపీడీవో శ్రీధర్ ఉపసర్పంచ్లకు వార్డు మెంబర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంజి ఎన్ఆర్ఇజిఎస్ నిధుల ద్వారా సిమెంటు రోడ్లు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పలు పూజ కార్యక్రమాలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన కార్యక్రమాలు బుధవారం నుండి జరుగుతాయని, ఈ కార్యక్రమాలకు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండలంలోని 41 పంచాయతీల ఉప సర్పంచులు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పూతలపట్టులో పాల్గొన్న ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

గుడిపల్లి సభలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

వెదురుకుప్పంలో..

బైరెడ్డిపల్లిలో..

సోమలలో..

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

సోమల: కళాశాల వద్ద కాంట్రాక్ట్ లెక్చరర్ల నిరసన

కుప్పం టౌన్: నిరసన వ్యక్తం చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు

- పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరైన లెక్చరర్లు

ప్రజాశక్తి-సోమల: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు నిరసన తెలిపారు. మంగళవారం పసుపు రిబ్బన్‌లు ధరించి విధులకు హాజరైయ్యారు. గతంలో ఎన్నికల కోడ్ వల్ల ఆగిన రెగ్యులరైజేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, జీవో నెంబర్ 114 అమలు చేయాలని, కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్‌ను రెగ్యులర్ చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. పసుపు రిబ్బను ధరించి కళాశాల మధ్య నిరసన తెలియజేస్తూ డిమాండ్ల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం అవుతామని అన్నారు.

జీవో 114ను అమలు చేయాలి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: జీవో 114ను అమలు చేయాలంటూ కుప్పం పట్టణంలోని ఎంఎఫ్‌సి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. పసుపు రిబ్బన్ ధరించి కళాశాలలో మంగళవారం నిరసన వ్యక్తం చేస్తూ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 114జీవోను తీసుకురావడం జరిగిందన్నారు. కానీ ఈ ఉత్తర్వులను అమలు నోచుకోలేదన్నారు. అప్పట్లో ఉత్తర్వుల అమలుకు ఎన్నికల నియమావళి అడ్డు వచ్చిందని, తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఒప్పంద అధ్యాపకుల ఇబ్బందులను గుర్తించి, గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను అమలు చేసి, ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ, శాశ్వత అధ్యాపకులుగా గుర్తించాలని కోరారు.

డిగ్రీ పరీక్షా ఫలితాల్లో ఎంవీఆర్ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-గంగవరం: గంగవరం మండలంలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్వీయూ విడుదల చేసిన డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చూపినట్లు కళాశాల కరస్పాండెంట్ ఎంవీఆర్ రెడ్డి తెలిపారు. బిబిఎ గ్రూప్‌లో కె హారిక-9.52, ఇ.మధురవాణి -9.20, ఎస్ హర్షిత -90.17, ఎ అజయ్ కుమార్ -9.11, బికాం గ్రూప్‌లో బి.రోహిణి -9.34, డి.రాజేష్ -9.01, ఎస్.ముష్కాన్ భాను -9.00, బిఎస్సీ గ్రూప్‌లో వై. పావని -9.20, ఎం. అర్చన -9.10, పి.హాసిని -9.06 పాయింట్లు సాధించారన్నారు. అదేవిధంగా 97శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ప్రిన్సిపల్ లక్ష్మీ సుధ అభినందించారు.

నవరత్నాల బోర్డు తొలగింపు

ప్రజాశక్తి-విజయపురం: కోసలనగరం సచివాలయంపై ఉన్న నవరత్నాల బోర్డును తొలగించడం వివాదాస్పందంగా మారింది. ఇది వరకే కలియంబాకం సచివాలయంలో శిలాఫలకం కొందరు నల్లరంగు వేయడం జరిగింది. వెంటనే అధికారులు అప్రమత్తం కావడంతో సద్దుకొన్నారు. అది మరవక ముందే కోసలనగరం సచివాలయంపై ఉన్న నవరత్నాల బోర్డును తొలగించడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఎక్కడ ఉంటే అక్కడ సమస్యలు జరుగుతుంటాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. బోర్డు తొలగింపు విషయంగా పంచాయతీ కార్యదర్శిని స్థానికులు ప్రశ్నించగా బోర్డుకు 'నన్ను కాపాల ఉండమంటారా' అని చెప్పడం వివాదస్పాదంగా మారింది. ఒక అధికారి అలా చెప్పడం ఎంత వరకు న్యాయమని ప్రజలు మండిపడ్డారు. చంద్రశేఖర్ ఎక్కడ పని చేసినా సమస్యలు సృష్టిస్తారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వరద బాధితులకు ఉపాధ్యాయుల విరాళం

కలెక్టర్‌కు డీడీని అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం తరపున విజయవాడ వరద బాధితులకు విరాళాన్ని అందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్ కుమార్‌ని కలిసి వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.86,100 డిడిని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు, చిత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘ అధ్యక్షులు అరుణ కుమార్, ప్రధాన కార్యదర్శి రవీంద్రా రెడ్డి, కోశాధికారి హేమాద్రి, రాష్ట్ర కౌన్సిలర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడు

కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

పుంగనూరులో

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలను కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కరన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్ బాబు హాజరయ్యారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వైనాన్ని వివరించారు. భవిష్యత్ తరాలకు అబ్దుల్ కలాం ఆదర్శ పాయమని కొనియాడారు. అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ విద్యార్థి దినోత్సవం, డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అబ్దుల్ కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా అందించిన సేవలను గురించి కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్ కుమార్, అధ్యాపకులు సుదర్శనం, డాక్టర్ గొర్రెల నాగరాజు, ఈశ్వరాచారి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, సోమశేఖర్, నాగరాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సోమల: సోమలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరు: భారత దేశపు మిస్సైల్ మెన్‌గా పేరుగాంచిన దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం అని ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ అయుబ్ ఖాన్ అన్నారు. మాజీ రాష్ట్రపతి జయంతి వేడుకలు పుంగనూరులో ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం ట్రస్ట్ సభ్యులు ఎస్‌కెఆర్ కంపెనీ అధినేత మురళి, నరసింహులు, రిటైర్డ్ డీఎస్పీ సుకుమార్ బాబు, టీపీస్ నాగరాజా, భద్రయ్య, పెద్ద మఠం బాబు, అమర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'భార్య, బిడ్డను కిడ్నాప్ చేశారు.. ఆదుకోండి'

విలేకరుల సమావేశంలో బాధితుడు పట్టాబి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తన భార్య, బిడ్డను కిడ్నాప్ చేసిన రైల్వే పోలీస్ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసి 15 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ చర్యలు చేపట్టలేదని పెనుమూరు మండలం పాపిరెడ్డిపల్లెకు చెందిన పట్టాబి మీడియాను ఆశ్రయించారు. చితూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురకంబట్టు పెద్ద కొత్తూరుకు చెందిన అశోక్ కుమార్తె రోజాను తాను పెళ్లి చేసుకోవడం జరిగిందన్నారు. తమకు ఒక బిడ్డ కూడ ఉన్నారని తెలిపారు. తాము జీవనోపాధి కొరకు బెంగుళూరులో కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నమని తెలిపారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ జ్ఞానశేఖర్ తన భార్యతో తరచు ఫోన్‌లో మాట్లాడుతున్న విషయం తెలిసి తాను మందలించడం జరిగిందన్నారు. ఆ తరువాత తన భార్య బిడ్డ కనిపించకపోవడంతో అనుమానం వచ్చి కానిస్టేబుల్ జ్ఞాన శేఖర్‌ని ప్రశ్నించడంతో మీ వల్ల అయింది చేసుకోండనీ, పంపించే ప్రసక్తే లేదని తమపై దౌర్జన్యం చేయబోయాడని వాపోయారు. తమపై కక్ష పెంచుకొని తన భార్య బిడ్డను కిడ్నాప్ చేశాడని ఆవేదన చెందారు. ఈ విషయంపై చిత్తూరు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, అయితే ఇప్పటివరకు కానిస్టేబుల్ జ్ఞానేశ్వర్‌పై చర్యలు తీసుకోలేదని వాపోయారు. తన భార్య, బిడ్డకు జ్ఞానేశ్వర్ నుంచి ప్రాణహాని ఉందని వెంటనే పోలీసులు తమకు న్యాయం చేయాలని తమ కుటుంబ సభ్యులతో కలిసి పట్టాభి మీడియాను వేడుకున్నారు.

తెగిన విద్యుత్ తీగ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయన పల్లి అంగన్వాడీ కేంద్రానికి ఉన్న విద్యుత్ వైరు తెగిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కి గురైయ్యే అవకాశం ఉంది. అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఈశ్వర్



ఈశ్వర్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఈశ్వర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తవణంపల్లి మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి వెదురుకుప్పం మండలానికి బదిలీపై వెళ్లారు.

ఆర్‌ఐగా ఏకాంబరం

ఏకాంబరం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల ఆర్‌ఐగా ఏకాంబరం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు వెదురుకుప్పం మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ ఆర్ఐ గా పనిచేస్తున్న దేవి కలెక్టర్ కార్యాలయంకు బదిలీపై వెళ్లారు.

'చేతుల శుభ్రతతో ఆరోగ్యం'

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చేతుల శుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రపంచ చేతుల శుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంహెచ్‌వో డక్టర్ ప్రభావతిదేవి అన్నారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 15న ప్రపంచ వ్యాప్తంగా దీని ప్రధాన ఉద్దేశ్యం చేతుల శుభ్రత ప్రాముఖ్యతను తెలియజేయడం అన్నారు. ఇది ఆరోగ్యాన్ని కాపాడే ఒక సులభమైన, శక్తివంతమైన చర్యను గుర్తు చేయడమే అన్నారు. ప్రతి రోజూ వందల కోట్ల మంది సబ్బు నీరు అందుబాటులో లేక పోవడం, కనీస పరిశుభ్రత సౌకర్యాల లోపం కారణంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రపంచ స్థాయికి ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడంలో చేతులు కడుక్కోవడం ఎంత కీలకమో, ప్రజల జీవితాలలో పరిశుభ్ర పాటించాలన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి- గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో 2024-2025 సంవత్సరానికి గాను పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపిపిజిసిఈటి-2024 సంవత్సర పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ జరుగుతాయని, స్పాట్ అడ్మిషన్స్ పొందిన విద్యార్థులు దరఖాస్తులను 22 నుంచి 24 తేదీ వరకు లోపు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500లు చెల్లించి ఆఫ్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సంబంధిత పూర్తి వివరాల కొరకు ద్రావిడ విశ్వవిద్యాలయం వెబ్సైట్ సందర్శించ వలసిందిగా ద్రవిడ అధికారులు తెలిపారు.

పేదల గుడిసెల పరిశీలన

గుడిసెలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం పంచాయతీ పరిధిలోని చాకలివాని గుంట ఎస్టీ కాలనీ, పద్మ సరస్సు ఎస్టీ కాలనీలో మంగళవారం ఎంపీడీవో చంద్రమౌళి పరిశీలించారు. పూరి గుడిసెలలో నివాసం ఉంటున్న లబ్ధిదారులతో తుపాను ప్రభావం గురించి ఎంపీడీవో చంద్రమౌళి, ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్‌డీ నాగరత్నమ్మ అడిగి తెలుసుకుని, తగు జాగ్రత్తలు చెప్పారు. అందులో మట్టి గోడలతో నివాసం ఉంటున్న వారిని పాఠశాలలో ఉండేలా పునర్వాసం చర్యలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పద్మ సరస్సు చెరువును పరిశీలించారు. ఎంపీడీవో వెంట కృష్ణయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వైద్యాధికారి డాక్టర్ గిరి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామంలో పారిశుద్ధ్య లోపించి అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గిరి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రజలు తమ పరిసర ప్రాంతాలను నీటి నిల్వ లేకుండా జాగ్రత్త వహించి ఫ్రైడే డ్రైడే తప్పనిసరిగా పాటించాలని అన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎంఎల్‌హెచ్‌సి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను ఆదేశించారు. ఎక్కడైనా జ్వరాలు అతిసారం ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే వైద్యాధికారికి సమాచారం అందించి సహకరించాలని కోరారు. తగినన్ని మందులు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

బకాయిలు వెంటనే చెల్లించండి

నేతాజీ చెరుకు రైతు సంఘం నాయకుల డిమాండ్

నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-విజయపురం(నింద్ర): నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ నుంచి తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని నేతాజీ చెరుకు రైతు సంఘం నాయకులు, చెరుకు రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతమ్స్ ఫ్యాక్టరీ యజమాన్యం, ఎస్‌టిసిఐ రైనాన్ కంపెనీలు కలిసి రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా ఏకపక్షంగా ఫ్యాక్టరీ ఆస్తులను అమ్మేయటానికి ఆన్లైన్ యాక్షన్ పెట్టారన్నారు కేవలం ఎస్‌టిసిసిఐ ఫ్యాక్టరీ వారి బాకీకి వేలం వేస్తే రైతులకు రావలసిన బకాయిలు రూ.35కోట్ల, కార్మికులకు రావాల్సిన రూ.13కోట్లు ఎవరు ఇస్తారని నిరసన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బకాయిలు ఇచ్చేంత వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్‌టిసిఐ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధి డీజీఎం బాత్రిత, అలాగే ఎసిసి వారితో మాట్లాడగా రైతులకు బాకీ అలాగే మిగతా బాకీల విషయాలపై విషయాలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించారు. తమ బాకీ తమకు ఇవ్వనంతవరకు ఆందోళన కార్యక్రమం విరమించేది లేదని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు నారాయణరెడ్డి, సుదర్శన్ నాయుడు, వాసు, ధనంజయులు నాయుడు, బాలయ్య, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

సింగర్ కార్తీక్ లైవ్ షోకు ఉచితంగా అనుమతించాలి

విసికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి నాయకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సింగర్ కార్తీక్ లైవ్ షోకి ఎస్‌వియూ విద్యార్థులకు ఉచితంగా అనుమతించాలని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షులు మన్నం ప్రేమ్ కుమార్ అధ్యక్షులు యుగంధర్ ఆధ్వర్యంలో వీసీ ఆచార్య అప్పారావుకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబర్ 26న సింగర్ కార్తీక్ మ్యూజిక్ లైవ్ షో ఎంట్రీ ఫీజులు రూ.699 నుంచి 7,499 రూపాయలు వరకు అత్యధిక ధరలకు టికెట్లను నిర్ణయించి విద్యార్థుల నుంచి డబ్బులు దోచుకోవడం దారుణం అన్నారు. విద్యార్థులకు ఉచితంగా ఈ లైవ్ షో తిలకించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లకుంటే ఈ లైవ్ షో ఈవెంట్ పర్మిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. అలా లేకుంటే ఈ లైవ్ షో ఈవెంట్ కు పర్మిషన్ రద్దు అయ్యే వరకు పెద్ద ఎత్తున యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి ఈవెంట్‌ను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు నాయకులు రూకేష్, ముని, నరేష్, లిఖిత్, మురళి , దినేష్, మునీంద్ర, బాలాజీ, సాయి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి విక్రేతల అరెస్ట్

మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: రామకుప్పం మండలంలో గంజాయి సేవిస్తున్న ఇద్దరిని రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో దాడులు చేసి అరెస్ట్ చేశారని డిఎస్పీ పార్థసారథి తెలిపారు. కుప్పం డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గుండ శెట్టిపల్లి గ్రామానికి చెందిన ఆదికేశవులు, లోకేష్ లను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. సుమారు 25కేజీల గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు. రామకుప్పం మండలంలోని 84 పెద్దురూ గ్రామంలో ధనరాజ్, అంజప్ప అనే వ్యక్తులు అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నారన్నారు. అంజప్ప, ధనరాజ్‌లు లోకేష్, ఆదికేశవుల ద్వారా ఇతరులకు గంజాయిని విక్రయించేవారన్నారు. అక్రమంగా గంజాయి సాగు చేస్తూ, విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐలు నరేష్, శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్ట్

నిందితుడిని అరెస్ట్ చూపుతున్న సిఐ హనుమంతప్ప

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని ఏయం పురం ఆదిఆంధ్ర వాడకి చెందిన మైనర్ బాలిక కిడ్నాప్ కేసును పోలీసులు ఛేదించారు. సీఐ హనుమంతప్ప కథనం మేరకు.. ఏయం పురానికి చెందిన కుమారి అనే మహిళ తన కుమార్తె మైనర్ బాలిక కిడ్నాప్ గురైందని ఈ నెల 6న ఎస్ఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారించిన పోలీసులు మంగళవారం ఉదయం కొత్తపల్లిమిట్టలో సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో పాకాల మండలానికి చెందిన వారికి దూరపు బంధువు కోటీ అతని తల్లిదండ్రులు తనను బలవంతంగా తీసుకెళ్లి సుబ్రమణ్య స్వామి ఆలయంలో వివాహం జరిపించినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటీని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బాల్య వివాహాలు జరిపించిన, ప్రోత్సహించిన, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్, సిబ్బంది కేసు దర్యాప్తులో పాల్గొన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు తాలూకా పోలీసులు భారీ మొత్తంలో అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. రూ.45వేల విలువైన 720ప్యాకట్ల మద్యం, రూ.3లక్షలు విలువ చేసే టాటా ఇండికా కారును స్వాధీనం చేసుకొని కర్నాటక మద్యం తరలిస్తున్న కర్నాటక రాష్ట్రం చిక్కుబల్లాపూర్‌కు చెందిన వ్యకిని అదుపులోకి తీసుకున్నారు. కర్నాటక మద్యం తరలిస్తున్నారనే రహస్య సమాచారం మేరకు చిత్తూరు రూరల్ ఈస్ట్ సీఐ శ్రీనివాస రావు, చిత్తూరు తాలుకా ఎస్ఐ రమేష్ బాబు, సిబ్బందితో కలసి మంగళవారం చిత్తూరు మండలం, నరిగిపల్లి గ్రామం నుంచి కన్నికాపురం గ్రామం వైపుగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక టాటా ఇండికా కారును అదుపులోకి తీసుకున్నారు. తనఖీ చేసి అందులో అక్రమంగా రవాణా చేస్తున్న 15కేసుల కర్నాటక మద్యంను గుర్తించి అందులో ఉన్న వ్యక్తి శివ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముద్దాయిని విచారించగా సదరు వ్యక్తి కర్నాటక మద్యంను కర్ణాటక రాష్ట్రం నుంచి ఏపీకి అక్రమంగా రవాణచేసి పెద్దఎత్తున డబ్బులు సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

తప్పతాగి డ్రైవింగ్ చేసిన 21మందికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 21మందికి కోర్టు రూ.10వేల చొప్పున రూ.2.10లక్షలు జరిమానా విధించారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 21మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున మొత్తం రూ.2.10లక్షల జరిమానా విధించారు. ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేకుంటే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ సీఐ నిత్యబాబు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం



ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని శెట్టిపేట పంచాయితీ మేకల చిన్నేపల్లికి చెందిన వృద్ధుడు వెంకటరాజు(73) అదృశ్య మైనట్లు మంగళవారం ఆయన కుమారుడు కొండూరు తిరుమల రాజు తెలిపారు. ఆగస్టు 28న ఇంటి నుంచి వెళ్లి ఆ తరువాత తిరిగి రాలేదన్నారు. 30న ఢిల్లీలో ఉన్నాను తిరిగి వస్తున్నట్లు వేరొకరి ఫోర్‌కు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఆయన రాకపై రైల్వేస్టేషన్‌లో గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయిందన్నారు. తన తండ్రి ఆచూకీ తెలిస్తే 7483007414 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రామ పరిపాలనపై అవగాహన

ప్రజాశక్తి-చౌడేపల్లి: పంచాయతీల పరిపాలన అభివృద్ధిపై స్థానిక మండల పరిపాలన భవనంలో ఉప సర్పంచులు వార్డు సభ్యులు కార్యదర్శులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సదుం: గ్రామ పరిపాలనపై మండల పరిధిలోని ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఈవోపీఆర్డి వరప్రసాద్ ప్రారంభించారు. ఆయన గ్రామ పరిపాలనపై, పంచాయతీ రాజ్ చట్టాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో హరిబాబు, జూనియర్ అసిస్టెంట్లు గురునాథం, నాగ శేషారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తులసి కృష్ణ, జగదీష్, లోకేష్, ప్రకాష్, జనార్ధన, విజయభాస్కర్, నవీన, ఉప సర్పంచులు బాబు రెడ్డి, రామచంద్రయ్య, ఆనంద రెడ్డి, వార్డు సభ్యులు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజులు శిక్షణా కార్యక్రమం ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. అందులో భాగంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీల విధులు, అధికారాలు, బాధ్యతలు ఉపసర్పంచులు, వార్డు మెంబర్ల పాత్ర, వారి విధులు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రాజశేఖరాచారి, సురేష్, గణేష్, మండల కో ఆర్డినేటర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: మండలంలోని ఉప సర్పంచ్లకు, వార్డు సభ్యులకు మంగళవారం ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయితీ అభివృద్ధి, గ్రామాలలో పారిశుధ్యం మెరుగు పరచడం, మౌలిక వసతులు కల్పించడంపై శిక్షణ ఇచ్చారు. ప్రతి పంచాయతీ పరిసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈవోపీఆర్‌డీ జి.నాగరత్నమ్మ అన్నారు. పంచాయతీ కార్యదర్శి గోపి, జయప్రకాష్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆరు నిమిషాల్లో ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

ప్రజాశక్తి-విజయపురం: ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజుల ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. అంతలోనే ఆరు నిమిషాల్లోనే ముగిసింది. ఉదయం 10.30 నిర్వహించాల్సిన శిక్షణ కార్యక్రమం 12.15 గంటలకు 9మంది వార్డు సభ్యులతో ప్రారంభమై 12.21ముగిసింది. ఈ ఆరు నిమిషాల్లో రెండు నిమిషాలు టీ తాగడానికి సరిపోయింది.

గైర్హాజరైన వార్డు సభ్యులు

రెండు రోజుల ఉపసర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి గౌరవ అధ్యక్షరాలు ఎంపీపీ గైర్హాజరు అయ్యారు. అలాగే 25పంచాయతీలలో పంచాయతీకి ఒక ఉపసర్పంచ్, ఇద్దరు వార్డు సభ్యులు హాజరు కావల్సి ఉంది. మొత్తం 75మందికి గాను 9మంది హాజకావడంతో కుర్చీలన్ని ఖాళీగా దర్శనమించాయి. అశించిన స్థాయిలో సభ్యులు హాజరుకాకపోవడంతో శిక్షణ కార్యక్రమం తూ తూ మంత్రంగా నిర్వహించారు.

సమాచారం ఇవ్వకపోవడం వల్లే..

రెండు రోజులు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు ఎవ్వరు చెప్పకపోవడం వల్లే ఈ కార్యక్రమం విఫలైయిందని విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉండవల్సిన ఎంపీపీకి కూడా ఎంపీడీవో రమణ ప్రకాష్ సమాచారం అందించలేదని సమాచారం. అధికారులు పని తీరు పలువురు విమర్శిస్తున్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-తవణంపల్లి: తుపాను కారణంగా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎన్ లావణ్య సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆవులు, గొర్రెలు మేతకు తీసుకువెళ్లద్దని తెలిపారు. తుపాను కారణంగా వాగులు, వంకలు ప్రవహించే అవకాశం ఉందని తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి దగ్గరే మేత అందిచాలని చెప్పారు. కరెంటు స్తంభాల దగ్గర తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ అత్తి మంజరి గోపాల్ పుట్టినరోజు సందర్భంగా గూడూరు పట్టణంలోని ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్ర మంలో కృప సేవ చారిట బుల్ ట్రస్ట్ సభ్యులు, కుటుంబ సభ్యుల నడుమ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతలుగా అత్తి మంజరి గోపాల్, భార్య మల్లేశ్వరి దంపతులు వ్యవహరించారు.